బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 20 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాలు విడుదల

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాలు విడుదలయ్యాయి. ఎన్టీఏ శుక్రవారం రాత్రి ఈ ఫలితాలను విడుదల చేసింది. శుక్రవారం మధ్యాహ్నం తుది కీ విడుదల చేసిన అధికారులు.. విద్యార్థులు సాధించిన పర్సంటైల్ స్కోరుతో ఫలితాలను విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించగా.. 24 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. కాగా, 110 మంది విద్యార్థుల ఫలితాలను నిలిపి వేసింది. అభ్యర్థులు ఫోర్జరీ దస్త్రాలను ఉపయోగించారని అందుకే వారి ఫలితాలను ఆపేశామని ఎన్టీఏ చెప్పింది. రాజస్థాన్‌కు చెందిన మహ్మద్ అనాస్ ఫస్ట్ ర్యాంకు, ఆయుష్ సింఘాల్ రెండో ర్యాంకు సాధించారు. 100 పర్సంటైల్ సాధించిన వారిలో తెలంగాణ నుంచి హర్ష ఎ.గుప్తా, వంగల అజయ్‌రెడ్డి, బనిబ్రత మజీ, ఏపీ నుంచి సాయిమనోజ్ఞ గుత్తికొండ ఉన్నారు. కాగా, హర్ష ఎ.గుప్తా దేశవ్యాప్తంగా 8వ ర్యాంకు సాధించగా, అజయ్‌రెడ్డి ఆలిండియా 16వ ర్యాంకుతో ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో టాప్‌లో నిలిచాడు. సాయిమనోజ్ఞ ఆలిండియా 22వ ర్యాంకు, బాలికల్లో 2వ ర్యాంకు సాధించింది. బనిబ్రత మజీకి ఆలిండియా 24వ ర్యాంకు లభించింది.

# ఢిల్లీని చూసైనా గుణపాఠం నేర్చుకోవాలి

- కాలుష్యంతో దేశ రాజధాని స్తంభించిపోయే పరిస్థితి ఉంది
- కాలుష్యంతో దేశ రాజధాని
- ఆ పరిస్థితులు మనకు ఎదురుకాకుండా ఉండేందుకే మూసీ ప్రక్షాళన
- తెలంగాణకు పరిశ్రమలు రావాలి.. పెట్టుబడులు పెరగాలి
- రాష్ట్ర అభివృద్ధికి ప్రవాసులు వీలైనంత సహకారం అందించాలి
- ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను అభివృద్ధి చేసుకుందాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- జపాన్ టోక్యోలో 'జపాన్ తెలుగు సమాఖ్య' ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న సీఎం



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీలో కాలుష్యంతో అన్ని సంస్థలకు సెలవులు ఇస్తున్నారని, కేవలం కాలుష్యం వల్లే దేశ రాజధాని స్తంభించిపోయే పరిస్థితి ఉందని, ఆ పరిస్థితులను చూసైనా మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ కాలుష్య పరిస్థితులు మనకు ఎదురుకాకుండా ఉండేందుకే మూసీ ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

జపాన్ దేశ పర్యటనలో భాగంగా టోక్యో నగరంలో 'జపాన్ తెలుగు సమాఖ్య' ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. "తెలంగాణకు పరిశ్రమలు రావాలి. పెట్టుబడులు పెరగాలి. తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలను పెంచాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం" అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధించడానికి ప్రవాసులు ఎవరికి చేతనైనంత వారు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం ఎంతో ఉంటుందని అన్నారు. న్యూయార్క్‌లో హడ్సన్ రివర్ ఫ్రంట్, లండన్‌లో థేమ్స్, సియోల్ నగరంలో రివర్ ఫ్రంట్లతో పాటు టోక్యో నగరంలో వాటర్ ఫ్రంట్లను పరిశీలించామని, ఇదే కోవలో హైదరాబాద్ నగర అభివృద్ధికి మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టామని చెప్పారు. కాలుష్యం కారణంగా ఢిల్లీ నగరం స్తంభించిపోయే పరిస్థితులను గమనిస్తున్నాం, ఇలాంటి పరిస్థితుల నుంచి గుణపాఠం నేర్చుకోవలసిన అవసరం ఉందన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల వంటి ప్రాజెక్టులు తెలంగాణ పురోగతికి అత్యంత కీలకమైన అంశాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఐటీ, ఫార్మా వంటి రంగాల్లో సాధించాల్సినంత ప్రగతి సాధించామని, ఇతర రంగాల్లో అభివృద్ధి సాధించాలని చెప్పారు. ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణ అభివృద్ధి సాధించడంలో అందరి సహకారం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జపాన్ తెలుగు సమాఖ్య ప్రతినిధులు, టోక్యో నగరంలో స్థిరపడిన ప్రవాస తెలుగు వారు పాల్గొన్నారు.



## యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను అందించేందుకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని "తెలంగాణ రైజింగ్" బృందం జపాన్‌కు చెందిన రెండు ప్రముఖ సంస్థలతో విజయవంతమైన చర్చలు జరిపింది.

తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (Telangana Overseas Manpower Company Ltd)-(TOMCOM%) , జపాన్‌కు చెందిన టెర్న్ గ్రూప్ (TERN Group - TGUK Technologies Private Limited), రాజ్ గ్రూప్‌లతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు.

ఈ ఒప్పందాల ద్వారా, రాబోయే 1-2 సంవత్సరాల్లో జపాన్‌లోని వివిధ రంగాల్లో 500 ఉద్యోగ అవకాశాలు తెలంగాణ యువతకు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో ఆరోగ్య సంరక్షణ రంగంలో 200, ఇంజనీరింగ్ (ఆటోమోటివ్, మెకానికల్, ఐటీ) రంగంలో 100, ఆతిథ్య రంగంలో 100, నిర్మాణ రంగం (సివిల్, భవన నిర్మాణం, పరికరాల నిర్వహణ)లో 100 ఉద్యోగాలు ఉన్నాయి. టోక్యో కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే TERN గ్రూప్, జపాన్‌లో సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్ మరియు Specified Skilled Worker (SSW) నియామకాల్లో ప్రసిద్ధి చెందిన సంస్థ. అలాగే, రాజ్ గ్రూప్, జపాన్‌లోని ప్రముఖ నర్సింగ్ కేర్ సంస్థ సుకూయి కార్పొరేషన్‌తో కలిసి, సంరక్షకుల (కేర్ టేకర్స్) శిక్షణ మరియు నియామకాలలో TOMCOMతో ఇప్పటికే సహకరిస్తోంది. తాజా ఒప్పందంతో ఈ భాగస్వామ్యం ఆరోగ్యేతర రంగాలకు కూడా విస్తరించనుంది. ఈ ఒప్పందాలు రాష్ట్ర ప్రభుత్వం యువతకు నైపుణ్య శిక్షణతో పాటు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను అందించే లక్ష్యాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి.



## 127.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే ఛాన్స్

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ధాన్యం కొనుగోళ్లపై మంత్రి సమీక్ష




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

యాసంగి ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ ముఖ్య అధికారులతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కొనుగోళ్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఏడాది యాసంగిలో రికార్డు స్థాయిలో 127.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే ఛాన్స్ ఉందన్నారు. వానకాలం, యాసంగి కలిపి 281 లక్షల టన్నుల దిగుబడి వచ్చే అవకాశముందని అని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 8329 కొనుగోలు కేంద్రాల ద్వారా 70.13 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ధాన్యం సేకరణకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ సూచించారు.

## బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం

- టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బీజేపీకి మాజీ మంత్రి కేటీఆర్ కట్టుబానిసలా పని చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను లిక్కర్ కుంభకోణం నుంచి బయటపడేసే క్రమంలో బీజేపీతో ఆ పార్టీ లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు కేటీఆర్ తాపత్రయ పడుతున్నారని విమర్శించారు. శనివారం ఈ మేరకు మహేష్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. సంఖ్యా బలం లేని బీజేపీ.. బీఆర్ఎస్ అండ చూసుకుని ఎన్నికల్లో పోటీ చేస్తోందని తెలిపారు. దొంగల ముఠాలా రాష్ట్రాన్ని పదేండ్లు దోచుకున్నార ని ఆరోపించారు. అవినీతి కేసుల నుంచి తప్పించుకునేందుకు కమలం పార్టీతో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని విమర్శించారు. పదేండ్లలో రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ నేతలపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఆ పార్టీ బలహీనతలను ఆసరా చేసుకున్న బీజేపీ రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటాలను, నిధులను ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ప్రశ్నించకపోవడంతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రవేశపెట్టిన బిల్లులకు మద్దతు ఇచ్చింది బీఆర్ఎస్ కాదా? అని నిలదీశారు. మోడీ నిర్ణయాలన్నింటికీ మద్దతిచ్చిన ఆ పార్టీ ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రశ్నించడం హాస్యాస్పదన్నారు. ఎమ్మెల్సీ కవితను లిక్కర్ కుంభకోణం నుంచి కాపాడేందుకు బీజేపీకి ఊడిగం చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూములపై రెండు పార్టీల నేతలు దుష్ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదిహేను నెలల స్వల్ప కాలంలో రికార్డు స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యోగాలివ్వడం, రైతు, మహిళా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం, ఎస్సీ వర్గీకరణ చేయడం, పేదలకు సన్నబియ్యం అందించడం వంటి గొప్ప పనులను సర్కార్ చేపట్టినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం బీఆర్ఎస్ నేతల అజ్ఞానానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.

## ఈడీ ఆఫీస్‌ను ముట్టడించిన యూత్ కాంగ్రెస్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సోనియా, రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఈడీ కార్యాలయాన్ని ముట్టడించింది. మోడీకి వ్యతిరేకంగా కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయాన్ని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన ఇందిరా, రాజీవ్ గాంధీల కుటుంబంపై మోడీ ప్రభుత్వం విషం కక్కుతున్నదని విమర్శించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉంటాం

- బలం లేదు కాబట్టే అభ్యర్థిని పెట్టలేదు
- విప్ జారీ చేస్తాం
- బీఆర్ఎస్ సాధించిన విజయాలు అసమాన్యమైనవని,
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు బీఆర్ఎస్ దూరంగా ఉంటుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. : బలం లేదు కాబట్టే అభ్యర్థిని పోటీలో పెట్టలేదు అన్నారు. హైదరాబాద్‌లోని కాలనీలు, బస్తీల్లో పార్టీ జెండా ఎగురవేసి, 27న జరిగే ఆవిర్భావ సభ కోసం దండులా కదలాలని కేటీఆర్ పిలుపు నిచ్చారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ ఆవిర్భావ సభ తెలంగాణ ప్రజల ఇంటి పండుగ అని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ నేతలు, కార్యకర్తలతో తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు. కౌన్సిలర్లకు విప్ జారీ చేస్తామని, ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి పిచ్చి పనులతో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో అసహ్యం పెరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సాధించిన విజయాలు అసమాన్యమైనవని, అనితర సాధ్యమైనవని కొనియాడారు. 2017 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 150కి 99 కార్పొరేట్ స్థానాలు గెలిచి బీఆర్ఎస్ చరిత్ర సృష్టించిందని చెప్పారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో క్లీన్ స్వీప్ చేశామన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓఆర్ఆర్ లోపల గులాబీ జెండానే ఎగిరిందని తెలిపారు. హైదరాబాద్ వాసుల ముందు కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు, దొంగనాటకాలు పనిచేయవని అన్నారు.

హైడ్రా పేరుతో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అరాచకం సృష్టించారని కేటీఆర్ అన్నారు. తన అన్న ఇంటిని కూల్చలేదు, ధనవంతుల ఇళ్లను ముట్టుకోలేదని తెలిపారు. గరీబోళ్ల ఇండ్లను కోర్టు సెలవులు చూసుకుని హైడ్రా ప్రతాపం చూపించిందని విమర్శించారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా హైడ్రా తన పనితీరు మార్చుకోలేదని అన్నారు. హైడ్రా దెబ్బ, రేవంత్ చేతగానితనానికి హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పతనమైందని తెలిపారు. లక్ష మంది ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని పేదల కడుపు కాంగ్రెస్ కొట్టిందని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు డబ్బులు లేవని అంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ అంటున్నారని మండిపడ్డారు. మూసీతో మురిసే రైతులు ఎందరు? వచ్చే ఉద్యోగాలు ఎన్ని? అని అంటే రేవంత్ రెడ్డి దగ్గర సమాధానం లేదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్టీపీలను కట్టి మూసీలోకి వ్యర్థాలు పోకుండా చేశామని గుర్తుచేశారు. మూసీ కోసం ఇండ్లను కోల్పోయినవారు బూతులు తిడితే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఈ సన్నాహక సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## హైడ్రా కూల్చివేతలు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మాదాపూర్‌లో అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చేసింది. ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ షెడ్లను తొలగించింది. హైడ్రా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని వసంత సిటీ సర్వే నంబర్ 79లో 39 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ స్థలాన్ని వసంత కృష్ణ ప్రసాద్, ముగ్గురు అనుచరులు కలిసి తప్పుడు పత్రాలను సృష్టించి కబ్జా చేశారు. దాదాపు రూ.2 వేల కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసి, నాలుగు భాగాలుగా విభజించి పలు షెడ్లు, కార్యాల యాలు, గెస్ట్ హౌస్‌ల నిర్మాణం చేపట్టారు. అనంతరం వారి మధ్య విభేదాలు తలెత్తడంతో మూడు నెలల కిందట హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి విచారణ చేపట్టిన హైడ్రా అధికారులు శనివారం కూల్చివేతలు చేప ట్టారు. భారీ షెడ్లు, కార్యాలయాలు, గెస్ట్‌హౌస్‌లు, ప్రహరీ గోడలను జేసీబీ సహాయంతో కూల్చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఆ స్థలాన్ని తమ అధీనంలోకి తీసుకున్నట్టు హైడ్రా అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు.


రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్, మాదాపూర్‌లో శనివారం హైడ్రా అధికారులు అక్రమ కట్టడాలను కూల్చేశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడా పరిధిలో సర్వే నెంబర్లు 213, 214లో నిర్మించిన ఫ్రీ కాస్ట్ వాల్స్‌ను తొలగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 213, 214 సర్వే నెంబర్లలో గతంలో రంగనాథ్ అనే వ్యక్తి లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయించాడు. అలాగే, ఈ స్థలం తనదంటూ.. కోర్టు నుంచి తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ రెండు సంవత్సరాల కిందట రోడ్డుకు అడ్డుగా ఫ్రీకాస్ట్ వాల్స్ నిర్మించాడు. దాంతో పలు కాలనీలకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. కాలనీల వాసులు రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో ఇటీవల హైడ్రాను ఆశ్రయించారు. దాంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు విచారణ జరిపి రోడ్డుకు అడ్డుగా వేసిన ఫ్రీ కాస్ట్ వాల్స్‌ను కూల్చేశారు. దాంతో కాలనీలవాసులు ఆనందం వ్యక్తం చేశారు.



## ఇక సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఇక నుంచి సురవరం ప్రతాపరెడ్డి తెలుగువిశ్వవిద్యాలయంగా ఉంటుందని ఆ వర్సిటీ వీసీ వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ అస్తిత్వ ప్రకటనలో భాగంగా తెలంగాణ భాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణకు, పరిపోషణకు విశేష కృషి చేసిన సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి సీఎం రేవంత్‌రెడ్డి పెట్టడం ఎంతో సముచితంగా, స్ఫూర్తిదాయకంగా ఉందని పేర్కొన్నారు. వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల పక్షాన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని జయశంకర్ విశ్వవిద్యాలయంగా, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని కాళోజి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, వీరనారి చాకలి ఐలమ్మ వంటి తెలంగాణ వైతాళికుల పేర్లను కూడా రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు పెట్టారని వివరించారు. ఇప్పుడు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్చాలంటూ శాసనసభ, శాసనమండలి ఆమోదించాయని తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి ఒక విశిష్ట చరిత్రకారునిగా, సామాన్య జనుల జీవితాలను చిత్రించిన కథా రచయితగా, రామాయణ మహా గ్రంథంలోని తార్కిక చారిత్రకాంశాలను వెలుగులోకి తెచ్చిన పరిశోధకునిగా అందరికీ తెలుసని పేర్కొన్నారు. 354 మంది తెలంగాణ కవుల వివరాలను పేర్కొంటూ గోల్కొండ కవుల సంచిక ప్రచురించి తెలంగాణలో కవులే లేరన్న అవహేళన చేసిన వారికి తిరుగులేని సమాధానం చెప్పారని గుర్తు చేశారు. ఆయన గోల్కొండ పత్రికను ప్రారంభించి తెలంగాణ ప్రజల్లో పోరాట పటిమను, తెగువను, చైతన్యాన్ని నింపారని తెలిపారు. తెలుగు నాట చరిత్ర అంటే రాజులదే కాదనీ సామాన్యుల గురించి చిత్రీకరించేదే నిజమైన చరిత్ర అని నిరూపించిన ప్రజా పక్షపాతి సురవరం ప్రతాపరెడ్డి అని పేర్కొన్నారు. నిజాంకు వ్యతిరేకంగా జోగిపేటలో జరిగిన ప్రప్రథమ ఆంధ్ర మహాసభకు అధ్యక్షులుగా వ్యవహరించి దిశానిర్దేశం చేశారని తెలిపారు.



## నిమ్స్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం సంభవించింది. శనివారం ఐదో అంతస్తు లోని ఎమర్జెన్సీ వార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో సిబ్బంది, రోగులు భయాందోళనకు గురయ్యారు. వేగంగా మంటలు వ్యాపించడంతో వార్డుల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేశారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల్లో దట్టంగా పొగ అలుముకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్టు భావిస్తున్నారు. ఈ ఘటనపై నిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం స్పందించింది. నిమ్స్ ఎమర్జెన్సీ బిల్డింగ్ ఐదో అంతస్తులో ఆడిటోరియం వద్ద (నాన్ పేషెంట్ ఏరియా) షార్ట్ సర్క్యూట్ జరిగిందని తెలిపింది. పొగలు వచ్చిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, మంటలంటుకోకుండా చర్యలు తీసుకున్నారని పేర్కొంది. అక్కడెవరికీ ఎలాంటి ప్రమాదమూ జరగలేదని, ఆస్తి నష్టం కూడా జరగలేదని తెలిపింది. ఈ అంశంపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆస్పత్రి డైరెక్టర్ బీరప్పతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎండాకాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ఇదిలా ఉండగా, ఆస్పత్రిలో ప్రమాదం జరిగిన అంతస్తులోని ఓ గదిలో టపాసులు ఉండటం కలకలం రేగింది. మంటలను ఆర్పే క్రమంలో అగ్నిమాపక సిబ్బంది వాటిని గుర్తించింది. టపాసులకు నిప్పు అంటుకొని ఉంటే దానికి బాధ్యులు ఎవరని రోగుల సహాయకులు ప్రశ్నిస్తున్నారు. అసలు ఆస్పత్రి గదిలోకి టపాకాయలు ఎవరు తీసుకొచ్చారు, ఎందుకు తీసుకొచ్చారు అనే విషయంపై చర్చ నడుస్తోంది. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు.

## చట్టం అందరికీ సమానమా.. ?
## ఎంపిక చేసిన వారినే టార్గెట్ చేస్తున్నారా..?

**● ఐఏఎస్ స్మితా సబర్వాల్**

**బలగం టీవీ, హైదరాబాద్**



చట్టం అందరికీ సమానమా.. ? ఎంపిక చేసిన వారినే టార్గెట్ చేస్తున్నారా..? అని ఐఏఎస్ స్మితా సబర్వాల్ ప్రశ్నించారు. గచ్చిబౌలి పోలీసులకు తాను పూర్తిగా సహకరించినట్లు చెప్పారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చినట్లు తెలిపారు ఐఎఎస్ స్మితా సబర్వాల్. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఎక్స్‌లో ఆమె ఒక పోస్ట్ రీట్విట్ చేయడంతో తెలంగాణ పోలీసులు నోటీసులు జారీ చేశారు.. పోలీసులు పంపిన నోటీసులపై స్మితా సబర్వాల్ తాజాగా తన ఎక్స్ ఖాతాలో స్పందించారు. ఆ పోస్టును తాను రీపోస్టు చేసినట్లే 2 వేల మంది షేర్ చేసినట్లు పేర్కొన్నారు. వాళ్లందరిపైనా ఇలాంటి చర్య తీసుకుంటారా..? చట్టం అందరికీ సమానమా.. ? ఎంపిక చేసిన వారినే టార్గెట్ చేస్తున్నారా..? అని ప్రశ్నించారు. దీనిపై స్పష్టత కోరినట్లు స్మితా సబర్వాల్ తెలిపారు.

ఇది ఇలా ఉంటే కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి మార్చి 31న 'హాయ్ హైదరాబాద్' అనే ట్విట్టర్ హ్యాండిల్ నుంచి పోస్ట్ చేసిన గిబ్లి తరహాలో ఉన్న ఇమేజ్‌ని స్మితా సబర్వాల్ రీట్వీట్ చేశారు. సేవ్ హైదరాబాద్, సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ అని పేర్కొన్నారు. ఆ పోస్టులో మష్రూమ్ రాక్ ఎదుట భారీ సంఖ్యలో బుల్డోజర్లు మోహరించగా, బుల్డోజర్లకు ఎదురుగా నెమలి, జింకలు ఉన్నాయి. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఇది ఫేక్ ఫొటో అంటూ అభియోగాలు మోపారు. ఈ మేరకు బీఎన్ఎస్ 179 సెక్షన్ కింద స్మితా సబర్వాల్‌కు పోలీసులు నోటీసులు పంపారు.

## 22న ఇంటర్ ఫలితాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో ఈ నెల 22న ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల కానున్నాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ సెకండ్ ఇయర్ ఫలితాలను ఒకేసారి విడుదల చేయనున్నారు. నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో 22న ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఫలితాలను విడుదల చేస్తారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య సహా అధికారులు పాల్గొననున్నారు. ఇంటర్ ఫలితాలు నేరుగా ఇంటర్మీడియట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ tsbie.cgg.gov.in లేదా results.cgg.gov.in లో అందుబాటులో ఉంటాయి. రిజల్ట్స్ వచ్చిన వెంటనే విద్యార్థులు తమ హాల్ టికెట్ నెంబర్ , పుట్టిన తేదీ ఎంటర్ చేసి ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలను మార్చి ఐదు నుంచి 25వ తేదీ వరకు 1532 కేంద్రాల్లో నిర్వహించారు. ఈ పరీక్షలకు 9, 96,971 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరంతా రిజల్ట్స్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. తొలిసారిగా రాండం రీవాల్యుయేషన్ సైతం నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఇంటర్మీడియట్ బోర్డ్ జాగ్రత్తలు తీసుకుంది.

## కాలేజ్ భవనంపై నుంచి దూకి బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**

కాలేజ్ భవనంపై నుంచి దూకి బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన సూర్యాపేట జిల్లాలో చోటుచేసుకుంది. చిలుకూరు మండలం గేట్ ఇంజినీరింగ్ కాలేజ్ లో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలానికి చెందిన కృష్ణవేణి అనే విద్యార్థిని బీటెక్ చదువుతోంది. శనివారం తెలవారుజామున కాలేజ్ భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. అయితే, సూసైడ్ చేసుకునే ముందు..హాస్టల్ గదిలో తల్లితో కృష్ణవేణి ఉన్నట్లు తెలుస్తోంది. కాలేజ్ యాజమాన్య వేధింపులే ఆత్మహత్యకు కారణమా? లేక కుటుంబ కలహాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

**ఇద్దరు మృతి**

**బలగం టీవీ, హైదరాబాద్**



గద్వాల జిల్లాలో గురువారం అర్ధరాత్రిఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇటిక్యాల మండలంలోని 44వ జాతీయ రహదారిపై ప్రియదర్శి హెూటల్ వద్ద కారు అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ధర్మారెడ్డి అనే వ్యక్తి కుటుంబీకులతో కలిసి ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు నంద్యాలకు వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఆరుగురు ఉన్నారు. ఇందులో పుల్లారెడ్డి, లక్ష్మిసుబ్బమ్మ దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మిగతా క్షతగాత్రులను హైవే అంబులెన్స్, 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా నలుగురు పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు సమాచారం.

## హైకోర్టు కొత్త చట్టం కనిపెట్టింది

**హైకోర్టుపై సుప్రీంకోర్టు సీరియస్**

**బలగం టీవీ, హైదరాబాద్**



శిక్షా కాలం సగం ముగిశాక శిక్ష రద్దుపై నిర్ణయం తీసుకుంటామంటూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఓ వ్యక్తి పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను పెండింగ్‌లో పెట్టడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. 'ఎటువంటి ప్రాతిపదిక లేని కొత్త చట్టాన్ని హైకోర్టు కనిపెట్టడం మాకు ఆశ్చర్యం కలిగించింది' అని వ్యాఖ్యానించిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేసింది.

అయితే, భారీ సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నందున తీర్పును సవాల్ చేస్తూ వేసే అప్పీల్‌పై సమీప భవిష్యత్తులో వాదనలు వినే అవకాశాలు లేవు కాబట్టి బెయిల్ ఇవ్వవచ్చని ఈనెల 17న వెలువరించిన తీర్పులో స్పష్టం చేసింది. చట్టాలను యథాతథంగా అమలు చేయాలని, బెయిల్ కోసం పిటిషనర్లు తమ దాకా వచ్చేలా చేయరాదని పేర్కొంది.

కాగా, హైకోర్టు ఏం చెప్పిందంటే.. 'తన వద్ద పట్టుబడిన నకిలీ నోట్ల గురించి పిటిషనర్ ఎటువంటి వివరణ ఇవ్వలేదు. అందుకే, శిక్ష నిలిపివేత, బెయిల్ మంజూరుకు తగు ప్రాతిపదిక లేదు. మొదటి దరఖాస్తును తిరస్కరించిన రెండు నెలల లోపలే బెయిల్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకున్నాడు. అందుకే, సగం శిక్షా కాలం పూర్తయ్యాక మరోసారి బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు' అని పేర్కొంది. సాధారణ చట్ట ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల్లో నిందితులకు బెయిల్ తిరస్కరించ వద్దని గతంలో ట్రయల్ కోర్టును, హైకోర్టులను కూడా సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసిందని ధర్మాసనం గుర్తు చేసింది.



## అనిల్ కుంబ్లేతో డీకే శివకుమార్ భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా దిగ్గజ క్రికెటర్ అనిల్ కుంబ్లేను కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయాన్ని ఎక్స్ ద్వారా పంచుకున్న శివకుమార్ దేశానికి, రాష్ట్రానికి కుంబ్లే చేసిన సేవలను కొనియాడారు దీనికి కుంబ్లే కూడా స్పందించాడు. తనను కలిసేందుకు విలువైన సమయాన్ని వెచ్చించినందుకు కృతజ్ఞతలు తెలిపాడు. అయితే, ఈ సమావేశం పై సోషల్ మీడియాలో రకరకాల కామెంట్లు వినిపిస్తున్నాయి. కుంబ్లేను డీకే రాజకీయాల్లోకి ఆహ్వానించారని చెబుతున్నారు. అయితే, కుంబ్లే మాత్రం ఇది వ్యక్తిగత సమావేశమని కొట్టి పడేశాడు.

## భారత్‌కు రానున్న మరో 8 చిరుతలు..

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత్ కు మరో ఎనిమిది చిరుతలు రానున్నాయి. దక్షిణ ఆఫ్రికాలోని బోట్స్వానా నుండి రెండు దశల్లో చిరుతలను తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ మే నాటికి నాలుగు చిరుతలను బోట్స్వానా నుండి ఇండియాకు తీసుకురానుందని అధికారులు తెలిపారు. తర్వాత, మరో నాలుగు చిరుతలను తీసుకురానున్నారు. ప్రాజెక్ట్ చిరుతలో భాగంగా వీటిని తీసుకు వస్తున్నట్లు ఎన్టీసీఏ అధికారులు సమాచారం అందించారని మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. "దక్షిణాఫ్రికా, బోట్స్వానా, కెన్యా నుండి మరిన్ని చిరుతలను భారతదేశానికి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే రెండు దశల్లో ఎనిమిది చిరుతలను భారతదేశానికి తీసుకురానున్నారు" అని పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు చిరుత ప్రాజెక్ట్ కోసం రూ.112 కోట్లకు పైగా ఖర్చు చేశామని, మొత్తం ఖర్చులో 67 శాతం మధ్యప్రదేశ్‌లో చిరుత పునరావాసానికి వెళుతున్నట్లు ఎన్టీసీఏ అధికారులు వెల్లడించారు.

## కెనడాలో కాల్పులు..
## భారతీయ విద్యార్థిని మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**



కెనడాలో దారుణం చోటు చేసుకుంది. ఓ దుండగుడు కాల్పులకు తెగబడడంతో భారతీయ విద్యార్థిని మృతి చెందింది. కెనడాలోని ఒంటారియోలోని హామిల్టన్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. హామిల్టన్‌లోని మోహాక్ కళాశాలలో చదువుకుంటున్న హర్‌సిమ్రత్ రంధవా (21) అనే విద్యార్థిని బుధవారం స్థానిక బస్టాప్ వద్ద వేచి చూస్తోంది. అదే సమయంలో ఉన్నట్టుండి. ఓ దుండగుడు కారులో అటుగా వచ్చి.. బస్టాప్ వద్ద ఆగి ఉన్న ఇంకో వాహనంపైకి కాల్పులు జరిపాడు.అయితే ఆ బుల్లెట్ పొరపాటున అక్కడే ఉన్న విద్యార్థినికి తగిలింది. దీంతో ఆమె ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. సమాచారం అందు కున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. రక్తపుమడుగులో ఉన్న హర్‌సిమ్రత్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఈ ఘటన అనంతరం అక్కడున్న రెండు వాహనాలు అదృశ్యమయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. . స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు హామిల్టన్ పోలీసులు తెలిపారు. ఈ కాల్పుల ఘటనతో హర్‌సిమ్రత్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఆమె అమాయకురాలని పోలీసులు స్పష్టం చేశారు. రెండు వాహనాల మధ్య జరిగిన గొడవలో ఈ దుర్ఘటన జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనా స్థలం నుంచి లభించిన వీడియో ఆధారంగా, నల్ల కారులోని ప్రయాణికుడు తెల్ల కారుపై కాల్పులు జరిపినట్లు గుర్తించారు.

హర్‌సిమ్రత్ రంధావా మృతి పట్ల టొరంటోలోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఆమె కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నామని, వారికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. హర్‌సిమ్రత్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఘటనపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు హామిల్టన్ పోలీసులు వెల్లడించారు. ఘటనపై సమాచారం తెలిసిన వారు లేదా డ్యాష్ కెమెరా ఫుటేజీ ఉన్నవారు తమను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## టీడీపీ ఎమ్మెల్యే నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆంధ్రప్రదేశ్ టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ నిర్మాణాలను కూల్చివేత ప్రారంభించింది. వసంత కృష్ణ ప్రసాద్ మైలవరం నియోజవర్గం ఎమ్మెల్యే. ఆయనకు చెందిన హఫీజ్‌పేటలోని వివాదాస్పదమైన 20 ఎకరాల్లో నిర్మాణాల కూల్చివేసింది. ఆ 20 ఎకరాల భూమి విలువ దాదాపు రూ.2వేల కోట్లు వరకు ఉంటుందని అంచనా. వసంత గ్రూప్ పేరుతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 20 ఎకరాల భూమిపై కొద్ది రోజులుగా హైకోర్టులో విచారణ నడుస్తోంది.

## బైడెన్‌పై ట్రంప్ తీవ్ర విమర్శలు

**బలగం టీవీ, హైదరాబాద్**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్... మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై, ఆయన అనుసరించిన వలస విధానాలపై తీవ్ర స్థాయిలో విరుచు కుపడ్డారు. నిద్ర మొహం బైడెన్ అసమర్థ పాలన, లోపభూయిష్టమైన సరిహద్దు విధానాల కారణంగా లక్షలాది మంది నేరస్థులు అమెరికాలోకి ప్రవేశించారని ట్రంప్ ఆరోపించారు. తాజాగా చేసిన వ్యాఖ్యలలో, ట్రంప్ బైడెన్‌నుద్దేశించి ఘాటు పదజాలం ఉపయోగించారు. "అమెరికా చరిత్రలోనే అత్యంత చెత్త అధ్యక్షుడైన జో బైడెన్, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది నేరస్థులను మన దేశంలోకి అనుమతించారు" అని పేర్కొన్నారు. ప్రమాదకరమైన, అనాలోచిత 'బహిరంగ సరిహద్దు' విధానం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆయన విమర్శించారు. దేశంలోకి వచ్చిన వారిలో చాలామంది హంతకులు, మాదకద్రవ్యాల వ్యాపారులు ఉన్నారని, ప్రపంచంలోని అనేక జైళ్లు, మానసిక వైద్యశాలల నుంచి విడుదలైన వ్యక్తులు కూడా ఉన్నారని ట్రంప్ ఆరోపించారు. "ఈ హంతకులు, దుండగులను ఇక్కడి నుంచి పంపించివేయడం నా పని. దానికోసమే నన్ను ప్రజలు ఎన్నుకున్నారు... ఇలా చేయక తప్పడంలేదు, నన్ను క్షమించండి" అని ట్రంప్ స్పష్టం చేశారు. తన మద్దతుదారులను ఉద్దేశిస్తూ, 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదాన్ని కూడా ట్రంప్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు

# భూ భారతితో భూ సమస్యలకు పరిష్కారం..

- రెండంచెల్లో అప్పీలు వ్యవస్థ
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- భూ భారతి చట్టం పై ఇల్లంత కుంటలో అవగాహన సదస్సు
- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ, కలెక్టర్ హాజరు



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

భూ భారతితో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును ఇల్లంతకుంట మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథులుగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు–భూ భారతి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిందని తెలిపారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని,

రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చెయ్యడానికి ముందు భూముల సర్వే ఉంటుందని వివరించారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందని వెల్లడించారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేస్తారని, భూమి హక్కులు ఎలా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేస్తారని వివరించారు. మ్యాప్ జియో ట్యాగింగ్ తో పాస్ బుక్కులు జారీ చేస్తామని తెలిపారు. భూ సమస్యల పరిస్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, రిజిస్ట్రేషన్ అనంతరం భూధార్ కార్డుల జారీ చేస్తుందని తెలిపారు. ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు ఉంటుందని వివరించారు. మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ప్రభుత్వం, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వర్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

అనంతరం మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, ధరణి చట్టంలో లోపాలతో రైతులు, ప్రజలు ఎండ్లపాటు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. వీటిని పరిష్కరించేందుకు సుదీర్ఘ సమీక్షలు, నిపుణుల సలహాలు, సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని వెల్లడించారు.

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సరైన ప్రణాళికతో భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. భూ సమస్యలతో బాధపడే వారంతా చట్టాన్ని సద్వినియోగం చేసుకొని హక్కులు పొందాలని పిలుపునిచ్చారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తారని వివరించారు. గ్రామ రెవిన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, తహసిల్దార్ ఫారూక్ అధికారులు సిబ్బంది, రైతులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసి.. కాంగ్రెస్‌లో చేరుతా..



**-బీఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి..**

**- బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు..**

**బలగం టీవీ, గంభీరావుపేట**

బీసీలకు కాంగ్రెస్ పార్టీ 42 శాతం కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీకి సపోర్ట్ చేస్తున్నానని, నెల రోజుల్లో టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసి సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతానని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. గంభరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి తో కలిసి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల మాటలు సమాజం తలదించుకునేలాగా ఉన్నాయని, అటువంటి భాష మాకు వచ్చునని కానీ సంస్కారం అడ్డు వస్తుందని అన్నారు. అటువంటి భాషను మీకు నేర్పింది కెసిఆర్ లేక కేటీఆర్ ప్రశ్నించారు. బిసి నాయకుడిగా 30 ఏళ్ల నుండి బీసీ ఉద్యమంలో ఉన్నానని, నేను బీసీ సంఘం నాయకుడిని అన్నారు. ఏ పార్టీ కూడా బీసీలకు న్యాయం చేయలేదని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కేటాయించిందని అందుకే బీసీ నాయకుడుగా సపోర్ట్ చేస్తున్నానని అన్నారు. ఆనాడే టీచర్ పదవికి రాజీనామా చేస్తానంటే, కేటీఆర్ వద్దని వారించాడని, బీసీ నాయకుడిగా బీఆర్ఎస్ పార్టీలోకి వస్తే రాష్ట్రస్థాయి పదవి ఇస్తానని కెటీ ఆర్ అన్నాడని, ఏ పదవి ఇవ్వకుండా కేటీఆర్ మోసం చేశాడని అన్నారు. కేటీఆర్ గంభీరావు పేట కి రూపాయి ఇవ్వలేదు అని, ఇటువంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. ఇక్కడ టిఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, అంగన్వాడి ఉద్యోగం, రెండు ఎకరాల పట్టా ఎట్లా వచ్చిందో లింగం యాదవ్ చెప్పాలని అన్నారు. ఇసుక స్మగ్లింగ్ చేసి టిఆర్ఎస్ నాయకులు అడ్డగోలుగా సంపాదించారని అన్నారు.గవర్నమెంట్ రూల్స్ ప్రకారమే లిక్కర్ బిజినెస్ చేస్తున్నానని, పక్కాగా చేస్తున్నానని, నక్సల్ భావాజాలం వ్యక్తినని, దొర్లకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తినని, జైలు కూడా పోయినని అన్నారు. బీసీ ఉద్యమం అంటే పర్శ హన్మండ్లు అని బీ ఆర్ ఎస్ నాయకులు అంటున్నరని అన్నారు. తుది శ్వాస వరకు బీసీ ఉద్యమంలో ఉంటానని, పీడిత ప్రజల పక్షాన పోరాడుతానని అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ మాట్లాడుతూ సంస్కారం లేకుండా బీ ఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని, మీ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. ప్రతిపక్షంలో ఉండి అధికారం పక్ష తప్పులను ఎత్తిచూపాలని,కానీ అభివృద్ధి పనులను అడ్డుకోవడం తగదని అన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదు అని అన్నారు. కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు టిఆర్ఎస్ నాయకుల ఫోన్లు కూడా లేపలేదని అన్నారు. రాజకీయంగా నామీద ఇంతవరకు ఒక మచ్చ కూడా లేదు అని, అలా ఉన్నట్లయితే రాజకీయాల నుండి తప్పుకుంటానని అన్నారు. గంభరావుపేట ను కేటీఆర్ ఎటువంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. గంభరావుపేట అభివృద్ధికై బరాబర్ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలుస్తానని, ప్రభుత్వ విప్, కేకే మహేందర్ రెడ్డి సహకారంతో ముందుకు పోతామని అన్నారు. భూమి కబ్జా రోడ్డుకు అడ్డంగా ఇల్లు కట్టింది లింగం యాదవ్ కాదా అని ప్రశ్నించారు. బీ ఆర్ఎస్ నాయకుల అవినీతిని ఒకటి ఒకటిగా బయటపడతామని అన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద లొల్లి చేసింది బీఆర్ఎస్ నాయకులని,మహిళా చైర్మన్ ని చూడకుండ హేలన గా మాట్లాడాలని అన్నారుబీ ఆర్ ఎస్ నాయకులు మాట్లాదే విధానం మార్చుకోవాలని అన్నారు. ఇలాగే ప్రవర్తిస్తే మిమ్మల్ని గ్రామాల్లో తిరగనించే పరిస్థితి ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, నాగభూషణం రాజ్ వీర్, సురేష్, రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఏపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా డా. నల్ల మధు...

**బలగం టీవీ, సిరిసిల్ల**

ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ – రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడి గా డా. నల్ల మధు,జనరల్ సెక్రటరీగా డా. సాయికుమార్ తడుకా లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు ఈ పదవుల్లో ఒక సంవత్సర కాలపరిమితిలో పనిచేయనున్నారు. అనంతరంకొత్త కార్యవర్గం బాధ్యతల స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రముఖ సీనియర్ పిల్లల వైద్యులు డా. కె ప్రసాద్ రావు, డా. మురళీధర్ రావు, డా. శ్రీనివాస్, డా. సురేంద్రబాబు, మరియు పీడియాట్రిషియన్లు పాల్గొన్నారు.





# రాజన్నను దర్శించుకున్న ఎస్పీ మహేష్ బి.గీతే

**బలగం టీవీ, వేములవాడ**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడలో శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని కుటుంబ సమేతంగా ఎస్పీ మహేష్ బి.గీతే శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. వేద పండితులు అద్దాల మండపంలో ఆశీర్వచనం ఇచ్చారు. ముందుగా స్వామివారికి ఇష్టమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఈవో కె.వినోద్ శేష వస్త్రం కప్పి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



# అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

**బలగం టీవీ,బోయినిపల్లి**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.శుక్రవారం బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, మాజీ డీసీఎంఎస్ సురేందర్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, మాజీ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, మాజీ సర్పంచ్ జోగు రవి, అంజన్ రావ్, మార్కెట్ చెర్మెన్ ఎల్లేష్, వైస్ చైర్మన్ వినోద్ రెడ్డి, మండల అధ్యక్షులు రమణా రెడ్డి, ఏనుగుల ప్రశాంత్ కుమార్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సుంకాపాక విక్రమ్ బాబు, ఉపాధ్యక్షులు జోగు శంకర్, గౌరవ అధ్యక్షులు జోగు రవి, సుంకపాక ప్రవీణ్, రామస్వామి, అంజయ్య, అనిల్ కుమార్, మార్కెట్ డైరెక్టర్ కల్లెపేల్లి సతీష్, కొంకటి మధు, సుంకపాక సురేష్,గజ్జెల రాజు, దమ్మ వెంకటరమణ, మల్లికార్జున్, దావ కనకయ్య, దొబ్బల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




# నల్ల బ్యాడ్జీలతో బొప్పాపూర్ ముస్లింల నిరసన

**-వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని డిమాండ్**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో జామ మసీదులో శుక్రవారం ప్రార్థనల అనంతరం ముస్లీం సోదరులు నల్ల బ్యాడ్జీలు ధరించి వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ సాహెబ్ మరియు గ్రామ అధ్యక్షులు ఇర్ఫాన్ హుస్సేన్ మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందిన సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. వక్ఫ్ సంబంధించిన భూములు ముస్లిం పెద్దలు కోటీశ్వరులు, దానాలుగా ఇచ్చిన భూములు అని అన్నారు. ఇట్టి భూములు దాన, ధర్మాలుగా వచ్చిన భూములని, ట్రస్టుల ద్వారా, సొంతంగా కొనుగోలు చేసిన భూములని అన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వక్ఫ్ భూముల కోసం ప్రాణాలు సైతం అర్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బొప్పాపూర్ ముస్లిం కమిటీ అధ్యక్షులు మహమ్మద్ ఇర్ఫాన్ హుస్సేన్, ఖలీద్, వహీద్, వాజిత్, షాకీర్ హుస్సేన్, సల్మాన్, జాకీర్ హుస్సేన్, జహ్వార్, హుజూర్, కరీం, ఖదీర్,సుమారు 300 మంది సభ్యులు పాల్గొన్నారు.

# ఆవేశ్ ఖాన్ మ్యాజిక్.. లక్నో విజయం

- రాజస్థాన్ రాయల్స్‌కు మరో ఓటమి



**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2025లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 2 పరుగులు తేడాతోవిజయం సాధించింది. ఆఖరి ఓవర్ లో రాజస్థాన్ విజయానికి 9 పరుగులు అవసరం అవ్వగా, ఆవేశ్ ఖాన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 6 పరుగులే ఇచ్చి హెట్మెయర్ (12) ను ఔట్ చేసి.. తమ జట్టుకు విజయాన్ని అందించాడు.

ముందు బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ లో ఓపెనర్ ఐదెన్ మార్‌క్రమ్ (45 బంతుల్లో 66బీ 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ఆయుష్ బదోని (34 బంతుల్లో 50బీ 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలో అదరగొట్టారు. ఇక ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్‌లో అబ్దుల్ సమద్ (10 బంతుల్లో 30లిబీ) నాలుగు సిక్స్‌లు బాది స్కోరును 180కి చేర్చాడు. ఈ క్రమంలో మార్‌క్రమ్, బదోని జోడీ నాలుగో వికెట్‌కు 76 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. మిచెల్ మార్ష్ (4), నికోలస్ పూరన్ (11), రిషబ్ పంత్ (3) ఫెయిల్ విఫలమయ్యారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో వానిందు హసరంగ 2, జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మ, తుషార్ దేశ్‌పాండే ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది. ఛేదనలో రాజస్థాన్ కు మంచి శుభారంభం దక్కింది. 14 ఏళ్ల టీనేజర్ వైభవ్ సూర్యవంశీ (20 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సుల సాయంతో 34 పరుగులు) తన అరంగేట్ర మ్యాచులోనే గర్జించాడు. ఓపెనర్ యశస్వి జైశ్వాల్ (52 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సుల సాయంతో 74 పరుగులు) చేశాడు. ఆ తర్వాత వచ్చిన నితీశ్ రాణా (8) విఫలమయ్యాడు. రెండో వికెట్ గా వెనుదిరిగాడు. అనంతరం మూడో వికెట్ గా యశస్వి జైశ్వాల్ పెవిలియన్ చేరగా.. నాలుగో వికెట్ గా రియాన్ పరాగ్ (39) వెనుదిరిగాడు. సిమ్రాన్ హెట్మెయర్ (12) నిరాశపరిచాడు. లక్నో బౌలర్లలో ఆవేశ్ ఖాన్ 3 వికెట్లతో మెరిశాడు. శార్దూల్ ఠాకూర్,మార్‌క్రమ్ వికెట్ దక్కించుకున్నారు.





## ఆర్సీబీకి ట్రోఫీ కష్టమే : వీరేంద్ర సెహ్వాగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్‌లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. ఈ సీజన్‌లో ఆర్సీబీ తన సొంత మైదానంలో వరుసగా మూడో ఓటమి ఇది. ఆర్సీబీ ఓటమి తర్వాత భారత మాజీ బ్యాటర్ వీరేంద్ర సెహ్వాగ్ ఆర్సీబీ ఆటగాళ్లపై విమర్శలు గుప్పించాడు. మ్యాచ్ తర్వాత క్రిక్‌బజ్‌లో వీరేంద్ర సెహ్వాగ్ మాట్లాడుతూ.. "ఆర్సీబీ పేలవంగా బ్యాటింగ్ చేసింది. అందరూ ఔట్ అవ్వడానికి అజాగ్రత్త షాట్లు ఆడారు. మంచి బంతికి ఒక్క బ్యాటర్ కూడా ఔట్ కాలేదు. కనీసం ఒక్క బ్యాటర్ అయినా కొంత తెలివి చూపించి ఉండాలి. వారి వద్ద వికెట్లు ఉంటే వారు 14 ఓవర్లలో 110 లేదా 120 పరుగులు సాధించగలిగేవారు. అది వారికి పోరాట అవకాశాన్ని ఇచ్చేది" అని వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. రజత్ పాటిదార్ ఆలోచించి పరిష్కారం కనుగొనాలి. వారు సొంత మైదానంలో గెలవలేకపోతున్నారు. ఆర్సీబీ బౌలర్లు బాగా రాణిస్తున్నారు. కానీ వారి బ్యాటర్లు ఎందుకు నిరంతరం విఫలమవుతున్నారు? ఆర్సీబీ బ్యాటర్లు సొంత మైదానంలో నిరంతరం విఫలమైతే అది మంచిది కాదు. దాన్ని ఎవరు మెరుగుపరుస్తారు? ఇలాగే ఆడితే ఆర్సీబీ ట్రోఫీని గెలుచుకునే అవకాశం ఉండదు."అని వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు.



## బట్లర్ విధ్వంసం.. గుజరాత్ విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**

గుజరాత్ టైటాన్స్ అదరగొడుతోంది. శనివారం ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 204 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. జాస్ బట్లర్ (97 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ భారీ స్కోర్ చేసింది. గుజరాత్ టైటాన్స్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న ఢిల్లీ బ్యాటర్లు సమిష్టిగా కదం తొక్కారు. అక్షర్ పటేల్(33) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా ఓపెనర్ కరుణ్ నాయర్(31) మరోసారి విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. ప్రసిద్ కృష్ణ(4-41) హడలెత్తించినా.. ఆఖర్లో ఫినిషర్ అశుతోష్ శర్మ(37) సిక్సర్ల మోతతో జట్టుకు కొండంత స్కోర్ అందించాడు. దాంతో, ఢిల్లీ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది.

అనంతరం భారీ ఛేదనలో వికెట్ కీపర్ జోస్ బట్లర్(97) విధ్వంసక హాఫ్ సెంచరీ సాధించడంతో గుజరాత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్లు విఫలమైనా.. బట్లర్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. షెర్ఫానే రూథర్‌ఫోర్డ్(43)తో కలిసి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 119 రన్స్ జోడించడంతో ఐపీఎల్ చరిత్రలో రికార్డు లక్ష్యాన్ని ఛేదించింది గుజరాత్. ఫలితంగా టేబుల్ టాపర్‌కు రెండో ఓటమి ఎదురైంది.

ఇదిలా ఉండగా ఆఖరి ఓవర్‌లో గుజరాత్ టైటాన్స్ విజయానికి 10 పరుగులు అవసరం కాగా మొదటి బంతికే రాహుల్ తెవాటియా సిక్సర్ బాదాడు. జోస్ బట్లర్ సెంచరీకి చేరువగా ఉండడంతో సింగిల్ తీసి, అతనికి స్ట్రైయిక్ ఇస్తాడేమో అనుకుంటే తర్వాతి బంతికి ఫోర్ బాది మ్యాచ్‌ని ముగించేశాడు. 54 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సర్లతో 97 పరుగులు చేసిన జోస్ బట్లర్, సెంచరీ పూర్తి చేసుకోలేకపోయాడు.

## పెళ్లిపై నమ్మకం లేదు...

- నటి త్రిష సంచలన వ్యాఖ్యలు



**బలగం టీవీ, హైదరాబాద్**

నటి త్రిష పెళ్లిపై కీలక కామెంట్స్ చేశారు. వివాహ వ్యవస్థపై తనకు నమ్మకం లేదని ఆమె తెలిపారు. కమల్ హాసన్‌తో కలిసి త్రిష నటించిన తాజా చిత్రం థగ్ లైఫ్. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న త్రిషకు పెళ్లిపై ప్రశ్న ఎదురైంది. దానికి త్రిష బదులిస్తూ.. వివాహంపై తనకు సరైన ఉద్దేశం లేదని చెప్పింది. తనకుపెళ్లి అయినా పర్వాలేదు.. కాకపోయినా ఫర్వాలేదని సమాధానం ఇచ్చింది. కాగా, గతంలో ఓ వ్యాపారవేత్తతో త్రిష నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత పెళ్లి చేసుకోకుండానే అతనితో త్రిష విడిపోయింది. ప్రస్తుతం ఆమె సింగల్ గానే ఉంటోంది. మొత్తంగా తనకు పెళ్లిపై సదుద్దేశం లేదని త్రిష స్పష్టం చేశారు. ఇక ఆమె సమాధానం విని పక్కనే ఉన్న కమల్ కూడా షాకయ్యారు.

కాగా, త్రిష సినిమాల విషయానికి వస్తే.. ఇటీవల అజిత్‌తో కలిసి 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాలో త్రిష నటించింది. ఈ మూవీ విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. ఇప్పటివరకు ఈ మూవీ వరల్డ్ వైడ్ గా 200 కోట్ల రూపాయలు వసూల్ చేసింది. ఇక, 'థగ్ లైఫ్' సినిమాతోపాటు తెలుగులో మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర చేస్తోంది.



## బాలకృష్ణ-గోపిచంద్ మలినేని మరో చిత్రం

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడల్ లో నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ గోపిచంద్ మలినేని కాంబోలో మరో సినిమా రాబోతోంది. ఈ మేరకు బాలయ్యతో రెండో సినిమాను ప్రకటించారు గోపిచంద్. వీరి కాంబోలో వీర సింహారెడ్డి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం జాట్ మూవీ ప్రమోషన్ లో ఉన్న గోపిచంద్ మాట్లాడుతూ.. బాలకృష్ణతో మరో సినిమా చేయబోతున్నానని. జూన్‌లో షూటింగ్ ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. ఈ మూవీ పూర్తైన తర్వాత 'జాట్ 2' చేయనున్నట్లు తెలిపారు. సెకండ్ పార్ట్.. మొదటి పార్ట్ కంటే మించి ఉంటుందని చెప్పారు.

## ఏఐతో భవిష్యత్తులో ఆందోళనకర పరిస్థితులు..


- ఏఆర్ రెహమాన్



**బలగం టీవీ, హైదరాబాద్**

ఏఐ వినియోగం విషయమై ఆస్కార్ అవార్డు విన్నర్, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఏఐను నియంత్రించకపోతే భవిష్యత్తులో ఆందోళనకర పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు. ఏఐ టెక్నాలజీ అనేది చాలా శక్తివంతమైదని, కానీ దాన్ని అవసరానికి మించి వినియోగిస్తే దుష్పరిణామాలు తప్పవు అని అన్నారు. "ఏఐ వల్ల మంచి, చెడు రెండూ ఉన్నాయి. మంచి కోసం మాత్రమే దీన్ని వినియోగించాలి. కొన్ని రోజులుగా దీని వినియోగం చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. పెరుగుతున్న టెక్నాలజీని ఉపయోగించడానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిని అందరూ తెలుసుకోవాలి. కొన్ని చెత్త పాటలను కూడా గొప్ప గాయకులు పాడినట్లు ఏఐతో క్రియేట్ చేస్తున్నారు. దీనికి ఎవరు బాధ్యత తీసుకుంటారో తెలియడం లేదు" అని తెలిపారు. కాగా, గతేడాది సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'లాల్ సలామ్' చిత్రంలో దివంగత గాయకులు బంబా బక్యా, షాహుల్ హమీద్‌ల వాయిస్‌ను ఏఐతో రెహమాన్ పునఃసృష్టించిన విషయం తెలిసిందే.

## డ్రగ్స్ కేసులో మలయాళ నటుడు అరెస్ట్



**బలగం టీవీ, హైదరాబాద్**

డ్రగ్స్ కేసులో మలయాళం నటుడు షైన్ టామ్ చాకోని కేరళలోని కొచ్చి సిటీ పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్ తీసుకున్నాడనే ఆరోపణలతో పాటు, మాదకద్రవ్యాల వినియోగం, కుట్ర కింద అతడిపై కేసు నమోదు చేశారు.ఎన్‌డీపీఎస్ చట్టంలోని 27, 29 సెక్షన్లు అతడిపై విధించారు.

కొచ్చి నగరంలోని ఓ స్టార్ హోటల్‌లో జరిగిన డ్రగ్స్ రైడ్ సందర్భంగా పోలీసుల నుంచి పారిపోయిన ఘటనతో ఆయనపై అనుమానాలు మొదలయ్యాయి. సహనటి విన్సీ అలోషియస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, డ్రగ్స్ మత్తులో తనపై వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చాకోను ఎర్నాకుళం టౌన్ నార్త్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఉదయం విచారణ అనంతరం ఆయనను రిమాండ్‌కు తరలించారు.

ఏప్రిల్ 16 రాత్రి, కొచ్చిలోని కలూర్‌లో ఉన్న ఓ హోటల్‌లో డిస్ట్రిక్ట్ యాంటీ-నార్కోటిక్ స్పెషల్ యాక్షన్ ఫోర్స్ బృందం డ్రగ్స్ కేసులో ఓ నిందితుడి కోసం రైడ్ చేసింది. ఆ సమయంలో హోటల్ రిజిస్టర్‌లో షైన్ టామ్ చాకో పేరు కనిపించడంతో పోలీసులు ఆయన మూడో అంతస్తులోని గదికి వెళ్లారు. అయితే, పోలీసుల రాకను గమనించిన చాకో, గది కిటికీ గుండా రెండో అంతస్తుకు దూకి, అక్కడి నుంచి స్విమ్మింగ్ పూల్ లోకి దూకి బైక్‌పై పరారయ్యారు. ఈ ఘటన మొత్తం హోటల్‌లోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయింది, ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అతని హోటల్ గదిలో ఎలాంటి డ్రగ్స్ లభించకపోవడంతో అప్పటికి ఎలాంటి కేసు నమోదు కాలేదు. అయితే, చాకో ఎందుకు పారిపోయారనే విషయంపై పోలీసులు ఆరా తీయగా, ఆయన డ్రగ్స్ వాడినట్లు విచారణలో అంగీకరించారని అధికారులు తెలిపినట్టు సమాచారం. ఈ ఘటనకు కొద్ది రోజుల ముందు, నటి విన్సీ అలోషియస్, చాకోపై సంచలన ఆరోపణలు చేశారు. వారు కలిసి నటిస్తున్న 'సూత్రవాక్యం' సినిమా సెట్‌లో చాకో డ్రగ్స్ మత్తులో తనపై అనుచితంగా ప్రవర్తించారని, తన నోటిలో తెల్లటి పొడి ఉన్నట్లు గమనించినట్లు ఆమె ఆరోపించారు. ఈ ఫిర్యాదును ఆమె అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ , కేరళ ఫిల్మ్ ఛాంబర్‌కు సమర్పించారు.